

● అంగన్‌వాడీల సమ్మె..

పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు గత నెల 12 నుంచి సమ్మె చేస్తున్నారు. వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వారిపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా.. వెనక్కి తగ్గకుండా నిరసనలు కొనసాగిస్తున్నారు. భోగి రోజు కూడా ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. 'మా కుటుంబాలకు సంక్రాంతి లేదా జగనన్నా..?' అంటూ ప్రశ్నిస్తున్నారు. అలాగే సమగ్ర శిక్ష సిబ్బంది కూడా నిరసన బాటపట్టారు. తమపై ప్రభుత్వానికి దయ లేదని.. సమగ్ర శిక్ష ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది వాపోతున్నారు.

● వైసీపీ పాలనలో కానరాని పండగ కానుకలు
● నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్యుల విలవిల
● హామీల అమలు, సమస్యలపై ఉద్యోగుల పోరాటం
● ఐదు వారాలుగా అంగన్‌వాడీల సమ్మె ● అన్నదాతలకూ తప్పని ఇబ్బందులు
● ఇప్పటికీ అందని టిడ్కో ఇళ్లు

సంక్రాంతి ఏదీ జగనన్నా..?



నరసన్నపేట : షోకాజ్ నోటీసులను దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



శ్రీకాకుళంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎన్ని పనులున్నా సరే ఏడాదికోసారి కుటుంబమంతా చేరి ఆనందంగా జరుపుకొనే పెద్ద పండగ సంక్రాంతి. టీడీపీ హయాంలో సంక్రాంతిని పురస్కరించుకుని ప్రజలకు పండగ కానుకలు అందించేవారు. లబ్ధిదారులకు వివిధ రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసేవారు. ప్రస్తుత వైసీపీ పాలనలో పండగ కానుకల ఊసేలేదు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యం సామాన్యులు విలవిల్లాడుతున్నారు. నిత్యావసరాలతోపాటు విద్యుత్ చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఉద్యోగులకు కూడా పండగ వేళ సైతం పోరుబాట తప్పడం లేదు. హామీల అమలు, సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు నెలరోజులకుపైగా నిరసనలు చేపడుతూనే ఉన్నా.. ప్రభుత్వం స్పందించడం లేదు. సమగ్రశిక్ష ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలనూ పట్టించుకోవడం లేదు. అలాగే గత ప్రభుత్వ హయాంలో సొంతింటి కోసం డబ్బులు చెల్లించినవారికీ ఇప్పటికీ టిడ్కో ఇళ్లను అప్పగించలేదు. ఇంకోవైపు రైతులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ఇలా వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో తమకు 'సంక్రాంతి ఏదీ జగనన్నా' అంటూ ప్రశ్నిస్తున్నారు.

● రైతుల అవస్థలెన్నో..

సిక్కోలు.. వ్యవసాయాధారిత జిల్లా. ప్రాజెక్టు పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వంశధార ఫేజ్ 2 పనులు పూర్తికాలేదు. నేరడి బ్యారేజీ సమస్య కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రత్యామ్నాయంగా హిరమండలం రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టినా.. ఇది కూడా పూర్తికాలేదు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ముందుకు కదలలేదు. పెద్దపెద్ద చెరువులను మినీ జలాశయాలుగా మారుస్తామన్న ప్రభుత్వ హామీ కూడా నెరవేరలేదు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. మిల్లర్లు బస్తాకు రెండు కిలోల అదనంగా వసూలు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. విక్రయించిన ధాన్యానికి సకాలంలో ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

● అంగన్‌వాడీల సమ్మె..

పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు గత నెల 12 నుంచి సమ్మె చేస్తున్నారు. వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వారిపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా.. వెనక్కి తగ్గకుండా నిరసనలు కొనసాగిస్తున్నారు. భోగి రోజు కూడా ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. 'మా కుటుంబాలకు సంక్రాంతి లేదా జగనన్నా..?' అంటూ ప్రశ్నిస్తున్నారు. అలాగే సమగ్ర శిక్ష సిబ్బంది కూడా నిరసన బాటపట్టారు. తమపై ప్రభుత్వానికి దయ లేదని.. సమగ్ర శిక్ష ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది వాపోతున్నారు.

● లబ్ధిదారులకు అందని టిడ్కో ఇళ్లు..

టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లను నిర్మించారు. అప్పట్లో లబ్ధిదారులు.. డీడీలు కింద డబ్బులు చెల్లించారు. ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. ఈలోగా ఎన్నికల రావడంతో కోడ్ నేపథ్యంలో పంపిణీ నిలిచిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటి విషయాన్ని మరిచిపోయింది. ఇప్పటికీ శ్రీకాకుళం నగర వాసులకు మినహా ఎక్కడా పంపిణీకాలేదు. ఆమదాలవలసలో లబ్ధిదారులు నిరీక్షణకు అంతులేదు. వారు డిపాజిట్ చేసిన డబ్బులకు ఇప్పటికీ వెనక్కిరాలేదు.. ఇళ్లు కూడా మంజూరు చేయలేదు. ఇచ్ఛాపురం, పలాసలో ఇదే పరిస్థితి. చాలాచోట్ల టిడ్కో ఇళ్లల్లో చీకట్లు అలుముకున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. ఇప్పటికైనా ఇళ్లను అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అలాగే గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల భవనాలు, సచివాలయ భవనాలకుగాను బిల్లులు చెల్లింపులు జరగలేదు. వారు కూడా చెప్పుకోలేని బాధ అనుభవిస్తున్నారు.

ఉపాధ్యాయులదీ అదే పరిస్థితి..

ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదంటూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఆదివారం నిరసన చేపట్టారు. యూటీఎఫ్ నాయకులు కిషోర్‌కుమార్, చౌదరి రవీంద్ర తదితరులు భోగి మంటల్లో జీవో ప్రతులను వేసి దహనం చేశారు.

మళ్లీ జగన్ గెలిస్తే..

రైతుల భూముల కబ్జా

● ఎంపీ రామ్మోహన్‌నాయుడు ● టీడీపీలో 150 కుటుంబాలు చేరిక

సరుబుజ్జిలి, జనవరి 14: రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ మళ్లీ గెలిస్తే.. రైతుల భూములను కూడా కబ్జా చేయడం ఖాయమని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ విమర్శించారు. ఆదివారం సరుబుజ్జిలి మండలం కొత్తకోటలో మండల టీడీపీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ సర్పంచ్ సురవరపు జగదీశ్వరరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సీనియర్ వైసీపీ నాయకులు కాగితాపల్లి తిరుపతిరావు, కాకితాపల్లి తవిటినాయుడు, డోల రామకృష్ణ, డోల బాబా, రమేష్‌బాబు, శివన్నారాయణతోపాటు సుమారు 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు, ప్రజల కష్టాల్లో ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. భారీ మెజార్టీతో తాను హ్యాట్రిక్ సాధించడం తథ్యమని తెలిపారు. కూన రవికుమార్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో రైతుల భూములు కూడా దోచుకునేలా వైసీపీ పాలన కొనసాగుతోందని విమర్శించారు. సైకో పాలనకు విముక్తి పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, తూర్పుకాపు కాపు సాధికారి అధ్యక్షుడు పల్లి సురేష్, మాజీ ఎంపీపీ కాద అప్పలనాయుడు, మాజీ జడ్పీటీసీ పీరుకట్ల సీతబాబు, లావేటి పూర్ణారావు, తాడేల వెంకటరమణ, సూర్యనారాయణ, కూన గణపతిరావు, కందుల వెంకటరావు, జనసేన ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు, సరుబుజ్జిలి మండల జనసేన అధ్యక్షుడు పైడి మురళీమోహన్ పాల్గొన్నారు.



ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్ జగదీశ్వరరావు, తదితరులు



టెక్కలి : చీకటి జీవోలను భోగిమంటలో దహనం చేస్తున్న అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు



అరసవల్లిలో గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో..

వైసీపీని బంగాళాఖాతంలో కలిపేద్దాం

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

టెక్కలి/కోటబొమ్మాళి, జనవరి 14: వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా సర్వనాశనం చేశారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు విమ ర్శించారు. ఆదివారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో రాష్ట్ర ప్రజలు ఆమోదించని నిరంకుశ ప్రభుత్వ చీకటి జీవోలను భోగీమంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీకి పాడి కడదాం.. బంగాళాఖాతంలో కలిపేద్దామని, జగన్‌రెడ్డికి ఈ ఎన్నికలతో ముగింపుకార్డు ఇద్దామని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలోనే అవినీతి పరుడైన ముఖ్యమంత్రిగా జగన్ గుర్తింపు పొందారని ఆరోపించారు. 'సామాన్యులు రాష్ట్రంలో బతకలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రాన్ని ఆందోళనాంధ్రగా మార్చేశారు. అంగన్‌వాడీలు సమ్మె చేస్తే ఎస్మా జీవో అమలు చేయడం దుర్మార్గం. వైసీపీ తరుపున ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కరువయ్యారు. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి ఓ అనామకుడికి ఆ పార్టీ టిక్కెట్ ఇచ్చింది. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం ఖాయం. టీడీపీ అధినేతకు కుప్పంలో లక్ష ఓట్ల మెజారీ తథ్యం. ఆ తర్వాత మెజార్టీ టెక్కలికి రావాలి. కార్యకర్తలు మరింత సంకల్పంతో పనిచేయాలి' అని అచ్చెన్న సూచించారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'ప్రభుత్వ విధానాల కారణంగా పండగపూట ఉద్యోగులు పస్తులు ఉంటున్నారు. యువతకు జాబ్‌క్యాలెండర్, మెగా డీఎస్సీ లేదు. బీసీలకు కార్పొరేషన్ రుణాలు లేవు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు అందలేదు. కొందరు వైసీపీ నాయకులు సంపాదన కోసం పోర్టును వాడుకుంటు న్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే వారి దందాల లెక్కలు తేలు తాయి. సీఎం జగన్ ఇసుక దందాతో పాటు లిక్కర్ మాఫియా, నాశిరకాల మద్యం అమ్మకాలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రశ్నిస్తే కేసులు బనాయిస్తున్నారు' అని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్.ఎల్. నాయుడు, బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, పినకాన అజయ్ కుమార్, బగాది శేషగిరి, జీరు భీమారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్, వెలమల విజయలక్ష్మి, శైలజ, తర్ర రామకృష్ణ, మట్ట పురుషోత్తం, మెండ దమయంతి పాల్గొన్నారు.

రాష్ట్రం వెలగాలి.. కీడు తొలగాలి

● భోగి మంటల్లో చీకటి జీవోల దహనం

● రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా టీడీపీ నిరసనలు

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ కొత్తూరు/ జలుమూరు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెలగాలి. ప్రజలకు పట్టిన కీడు తొలగాలి అంటూ టీడీపీ నేతలు నినదించారు. భోగి మంటల సాక్షిగా వైసీపీ ప్రభుత్వ విధానాలపై ఆదివారం జిల్లావ్యాప్తంగా నిరసన చేపట్టారు. వైసీపీ పాలనలో చీకటి జీవోలతో అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు ప్రజా నిర్ణయాలకు వ్యతిరేకంగా విడుదల చేసిన చీకటి జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో కమ్ముకున్న 'చీకటి' తొలగిపోవాలని.. ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరసవల్లిలో శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జీవో ప్రతులు దహనం చేశారు. కొత్తూరు మండలం మాతల, సారవకోట మండలం సవరడ్డపనస గ్రామాల్లో పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జిలు కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు.



కొత్తూరు : మాతలలో కలమట ఆధ్వర్యంలో..



జలుమూరు : సవరడ్డపనసలో ప్రతులను దహనం చేస్తున్న బగ్గు



● ఘనంగా గోదాదేవి కల్యాణం

భోగి పర్వదినాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం ముగియడంతో ఆదివారం జిల్లావ్యాప్తంగా వివిధ ఆలయాల్లో గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీకాకుళం కోదండ రామాలయంలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.



శ్రీకాకుళం పొట్టిశ్రీరాముల మార్కెట్‌లో రద్దీ



శ్రీకాకుళంలో భోగి మంట..

జన సందడి

● ఘనంగా భోగి ● మార్కెట్లు కిటకిట

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ కల్చరల్, జనవరి 14 : సిక్కోలులో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఉపాధి కోసం వలస వెళ్లిన వారంతా.. పెద్ద పండగను పురస్కరించుకుని స్వగ్రామాలకు చేరుకోవడంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లావాసులు భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. వేకువజామున చిన్నారులు, పెద్దలు అంతా కలిసి గ్రామాలు, పట్టణాల్లో భోగిమంటలు వేశారు. కొత్తవస్త్రాలు ధరించారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి పెద్దలు ఆశీర్వదించారు. సోమవారం మకర సంక్రాంతి వేడుకలకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో కొత్త దుస్తులు, పూజాసామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. ఆదివారం శ్రీకాకుళంలోని పొట్టి శ్రీరాముల మార్కెట్ జనాలతో కిక్కిరిసిపోయి రద్దీగా కనిపించింది. రైతుబజారు కూడా కిటకిటలాడింది.

తిమడాం కాలనీలో భారీ చోరీ

● 38 తులాలు బంగారం, ఆరున్నర కేజీల వెండి అపహరణ

జలుమూరు, జనవరి 14: తిమడాం కాలనీలోని బరాటం ప్రసాదరావు ఇంట్లో భారీ చోరీ జరిగింది. 38 తులాల బంగారం, ఆరున్నర కేజీలు వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితుడు ప్రసాదరావు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి. విశ్రాంతి ఉపాధ్యాయుడు బరాటం ప్రసాదరావు ఈ నెల 2న ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో సహా పక్క గ్రామమైన లింగన్నాయుడుపేటలో అత్తవారి ఇంటికి వెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చి చూడగా బీరువా లేదు. దీంతో పరిసర ప్రాంతాలు పరిశీలించారు. ఇంటి వెనుక భాగాన ఉన్న తలుపులు పగులగొట్టి ఉండడంతో.. ఆ మార్గాన దొంగలు ప్రవేశించి బీరువాను తీసుకెళ్లిపోయి ఉంటారని భావించారు. బీరువాతోపాటు అందులో ఉన్న 38 తులాల బంగారు ఆభరణాలు, ఆరున్నర కేజీల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే దొంగతనం ఎప్పుడు జరిగిందనేది స్థానికులు కూడా కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని ఏఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు, ఎస్ఐ పారినాయుడు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన తీరును పరిశీలిస్తే స్థానికులే దొంగతనం చేసి ఉంటారని భావించారు. క్లూస్ టీం నేర స్థలాన్ని పరిశీలించి వేలముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు.



ప్రసాదరావు నుంచి వివరాలు సేకరిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు

వైసీపీ ప్రభుత్వానికి ఇదే చివరి సంక్రాంతి

కొత్తూరు: వైసీపీ ప్రభుత్వానికి ఇదే చివరి సంక్రాంతి అని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి అన్నారు. మాతల గ్రామంలో భోగి పండగను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను భోగి మంటలో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడడం ఖాయమన్నారు. రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమస్యలతో నరకం చూశారన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించడం ద్వారా చంద్రబాబును మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సవరడ్డపనస కార్యాలయంలో...

జలుమూరు, (సారవకోట): సవరడ్డపనస టీడీపీ కార్యాలయ ఆవరణలో ఆదివారం రాష్ట్రానికి పట్టిను చీడ తొలగాలని, ఆంధ్ర వెలగాలని నినాదాలు చేస్తూ మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను భోగి మంటలో వేసి నిరసన తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. నెయ్యి గుర్రంతో గిరిజన నృత్యం, శ్రీరామదాసు వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్, సారవకోట, జలుమూరు, నరసన్నపేట మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, వెలమల రాజేంద్రనాయుడు, శిమ్మ చంద్రశేఖర్, నాయకులు దుంగ స్వామిబాబు, సురవరపు తిరుపతిరావు, ఊణ్ణ వేంకటేశ్వరరావు, పిల్లా నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కార్యాచరణతో వైసీపీలో వణుకు

పోలాకి: టీడీపీ, జనసేన ఉమ్మడి కార్యాచరణతో వైసీపీలో వణుకు పుడుతోందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం ప్రియాగ్రహారం, కోడూరు గ్రామాలో పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని కోరారు. పార్టీ విజయం కోసం సమష్టిగా పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ధర్మాన తేజ, ఎంపీ నాయుడు, లావేటి కృష్ణ, భైరి భాస్కరరావు, చిట్టి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి



గార: రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసిన సీఎం జగన్ పాలనకు చరమగీతం పాడాలని కోరుతూ ఆదివారం కుమ్మరి పేటలో బైబై జగన్ అంటూ టీడీపీ నాయకులు కరపత్రాలను భోగి మంటలో వేసి నిరసన తెలిపారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్ పాల్గొన్నారు.

17న హోలహోలేశ్వర స్వామి తిరునాళ్లు

నరసన్నపేట: ధనుర్మాసంలో నెలరోజుల పాటు నిర్వహించే మేలుకొలుపులు హైందవ సంస్కృతికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని హిందూ ధార్మిక మండలి సభ్యుడు శిమ్మ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం రెడ్డికపేట హోల హోలేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 17న శ్రీరామ పాదయాత్ర తిరునాళ్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి ఏటా ముక్కనుము రోజున జరిగే యాత్ర నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గొట్టిపల్లి సర్పంచ్ అవ్వ రవి, షణ్ముఖరెడ్డి, అల్లు అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

● భక్తిశ్రద్ధలతో గోదా రంగనాథుల కల్యాణోత్సవం

ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆదివారం భోగి పర్వదినాన పలు ఆలయాల్లో గోదా రంగనాథుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున భోగి మంటలు వేసిన తరువాత ఆలయాల్లో తిరుప్పావై చివరి పాశుర విన్నపం, గోదా రంగనాథ స్వాములకు కల్యాణం చేపట్టారు. విశేష పూజలు, విశేష హారతులు, ప్రసాదాలను సమర్పించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

\- ఆంధ్రజ్యోతి బృందం



టెక్కలి: నరసింహ స్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం



నందిగాం: సుబ్బమ్మపేట లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో...



శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమలలో



నరసన్నపేట: గీతామందిరంలో..



ఇచ్ఛాపురం: పెద్ద జగన్నాథస్వామి ఆలయంలో...







మందస: వాసుదేవుని ఆలయం, జలుమూరు వేంకటేశ్వరాలయం, వజ్రపుకొత్తూరు: రిట్టపాడు ఆలయంలో కల్యాణం



పోలాకి: కిల్లిబుచ్చెన్నపేట వేంకటేశ్వరాలయంలో...



నందిగాం: పెంటూరులో గోదాదేవికి సమర్పించిన సారె

'మార్పు' ఆశయ సాధనకు కృషి

మందస: శ్రీకాకుళం సాయుధ పోరాట నాయకుడు మార్పు పద్మనాభం ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ అన్నారు. హరిపురం మార్పు గ్రంథాలయం ఆవరణలో ఆదివారం మార్పు 58వ వర్ధంతి సభ నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన పాత్ర చిరస్మరణీయమన్నారు. తొలితరం కమ్యూనిస్టుగా, రైతాంగ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. పద్మనాభం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్పు ట్రస్టు అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు గొరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, టి.అప్పయ్య, బర్ల గోపి, పి.మల్లిబాబు, సోమనాథ, కె.కృష్ణ, నల్లహడ్డి, పి.రాము పాల్గొన్నారు. ● **కాశీబుగ్గ:** తొలితరం కమ్యూనిస్టు ఉద్యమ నేత మార్పు పద్మనాభం నిరంతరం బడుగు వర్గాల సంక్షేమం కోసం పాటుపడ్డారని వక్తలు అన్నారు. కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఆదివారం రైతాంగ ఉద్యమ నేత మార్పు పద్మనాభం 58వ వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సీఐటీయూ నాయకుడు గణపతి, సీహెచ్ వేణుగోపాల్, మద్దిల రామారావు తదితరులు పాల్గొన్నారు.



మార్పు పద్మనాభం విగ్రహం వద్ద నివాళి

సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

పర్లాకిమిడి: మన సంస్కృతీ సంప్రదాయాలను మనం పాటించడం ద్వారా భావి తరాలకు అందించాలని హైటెక్ విద్యాసంస్థల డైరెక్టర్, యువ ఇంజనీర్, బీజేడీ నాయకుడు రూపేష్ పాణిగ్రాహి అన్నారు. హైటెక్ ప్లాజాలో ఆదివారం సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్లాకిమిడి నియోజకవర్గం ఒడియా తెలుగు ప్రజల సమ్మేళనంతో కూడుకున్నదన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రముఖ తెలుగు సినీ నటుడు సాయికుమార్ పాల్గొని ఒడిశా ప్రజలతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. ప్రముఖ ఒడియా, తెలుగు గాయకులు పాల్గొని సినీ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో హైటెక్ విద్యాసంస్థల అధినేత తిరుపతి పాణిగ్రాహి, బీజేడీ నాయకులు పాల్గొన్నారు.



వేడుకల్లో మాట్లాడుతున్న సాయికుమార్

ఒడిశా

ఈవీఎంలపై అవగాహన

పర్లాకిమిడి: రానున్న ఎన్నికల్లో ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించేందుకు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ప్రారంభించారు. ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 25 వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన చేపట్టనున్నట్లు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలు అగ్నికి ఆహుతి

పలాస: స్థానిక సీతమ్మగుడి సమీపంలో తెలుకుల రాసమ్మకు చెందిన పొలంలో కుప్పలుగా పెట్టిన ధాన్యం రాశులకు ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని సుమారు 20 బస్తాల ధాన్యం అగ్నికి ఆహుతైంది. వెంటనే అగ్నిమాపకశాఖ సిబ్బంది సకాలంలో వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చినప్పటికే ధాన్యం కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లి నట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. సంక్రాంతి తరువాత మిల్లుకు పంపేందుకు ఉంచిన ధాన్యం కాలిపోవడంతో ఆమె ఆవేదనకు గురవుతున్నారు.

ఏటీఎంలో నో క్యాష్

సంతబొమ్మాళి: మండలంలోని ఒకేఒక్క నౌపడ ఏటీఎంలో డబ్బులు లేక ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో బ్యాంక్‌లు మూత పడ్డాయి. దీంతో ఖాతాదారులు ఏటీఎంపైనే ఆధారపడు తున్నారు. అయితే అక్కడ కూడా నగదు లేకపోవడంతో టెక్కలి, పూండి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోందని వారు వాపోతున్నారు.

సేవలే గుర్తింపు నిస్తాయి

వజ్రపుకొత్తూరు: ఉద్యోగికి సేవలే గుర్తింపునిస్తాయని వజ్రపుకొత్తూరు ఎస్ఐ మధు సూదన్ అన్నారు. కాశీబుగ్గ రూరల్ సీఐగా విధులు నిర్వహించి బదిలీ అయిన శంకరరావును ఆదివారం వజ్రపుకొత్తూరులో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సున్నారావు, నాయకులు కొర్రాయి గోపి, బొత్స షణ్ముఖరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడండి

మందస: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి పరిరక్షించాలని వాణిజ్య పన్నులశాఖ ఉప సహాయ కమిషనర్ బడియా కామరాజు అన్నారు. కొత్తపల్లి అంబేడ్కర్ భవన ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎం.భాస్కరరావు, పి.ప్రకాశరావు, భీమారావు, రాజా, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ

పలాస: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో వైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 224 పేద కుటుంబాలకు రూ.2.70 లక్షలు విలువైన నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు మల్లా కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రతి ఏటా పేద వైశ్య కుటుంబాలకు దుస్తులు, నిత్యావసరాలు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి తంగుడు వైకుంఠరావు, కోశాధికారి పీవీ సతీష్‌కుమార్, పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, తంగుడు కామేశ్వరావు, కొత్తకోట తిరుమలరావు, టంకాల రవిశంకర్ గుప్తా, కోట్ని శశి, యువజన సంఘం అధ్యక్షుడు మల్లా గణేష్, డోకి నాగేశ్వరరావు, బెల్లాల సత్యనారాయణ, తంగుడు కనకరాజు, మహిళా సంఘం అధ్యక్షురాలు మల్లా సౌజన్య, పలువురు సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి సాయం

నందిగాం: అనారోగ్యంతో బాధపడుతున్న తోటి విద్యార్థికి 1996-97 విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. నర్సిపురం సోమేశ్వరరావు పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని ఆయన సహచరులు రూ.20 వేలు విరాళాలు సేకరించి ఆదివారం లఖిదాసుపురంలో బాధితుడికి అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాదిన జయంతిరావు, జినగ షణ్ముఖరావు, కోనారి ప్రభాకరరావు, సీమ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి: బోరుభద్రలో..


ఎచ్చెర్ల: ఫరీద్‌పేటలో..


రణస్థలం: సీతంవలసలో..


హిరమండలం: చిన్నకోరాడ వీధిలో 180 అడుగుల పిడకల దండతో చిన్నారులు

వాడవాడలా భోగి సందడి

జిల్లా వ్యాప్తంగా ఆదివారం భోగి మంటలతో ప్రజలు సందడి చేశారు. పెద్ద ఎత్తున యువత, మహిళలు ఈ ఉత్సవంలో పాలుపంచుకున్నారు. అలాగే సంక్రాంతిని పురస్కరించుకుని సమీపంలోని పట్టణాలకు దుస్తులు, సామగ్రి కొనుగోలుకు తరలిరావడంతో వీధులు కిటకిటలాడాయి. వివిధ గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి.

- ఆంధ్రజ్యోతి బృందం


పలాసరూరల్: బొడ్డపాడులో..


ఇచ్ఛాపురం: బెల్లుపడ జంక్షన్‌లో చిన్నారులు..


నందిగాం: పెంటూరులో..


జలుమూరు: సారవకోట మండలం సవరడ్డపనసలో..


గార: కె.మత్స్యలేశంలో..


ఎచ్చెర్ల: దేవీ ఆశ్రమంలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తూ..


పలాస: రైల్వేకాలనీ ఇనిస్టిట్యూట్ వీధిలో..


సరుబుజ్జిలి: నందికొండ గ్రామంలో..


ఇచ్ఛాపురం రూరల్: లక్ష్మీపురంలో చిన్నారుల సందడి


అరసవల్లి: ఆదిత్యాలయ ప్రాంగణంలో..


పాతపట్నంలో..


నరసన్నపేట మార్కెట్‌లో..


ఆమదాలవలస మార్కెట్‌లో..


ఇచ్ఛాపురం మార్కెట్‌లో..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండలం పాత్రునివలస గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. రూరల్ ఎస్‌ఐ ఎ.విజయకుమార్ తెలిపిన వివరాల మేరకు.. పాత్రునివలస గ్రామానికి చెందిన టెంక విశ్వేశ్వరరావు దుర్గాదాబాలో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని తన భార్య ఈశ్వరమ్మ పెద్దపాడు రోడ్డులోని ఓ స్టోర్‌లో పనిచేస్తుండగా, ఆమెను తీసుకురావడానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా రామలక్ష్మణ కూడలి నుంచి వస్తున్న ఓ వ్యాన్ ఢీకొంది. దీంతో విశ్వేశ్వరరావుకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో అతడిని రిమ్స్‌కు తరలించగా.. అక్కడ నుంచి జెమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, డ్రైవర్ దుంప తాతారావును అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించారు.

ఇరువర్గాల కొట్లాట.. కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం: నగరంలో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని హయాతిన గరంలో నివసిస్తున్న దుక్క శ్రీనివాసరావు శనివారం సాయంత్రం ట్రాక్టర్‌పై వరి గడ్డి తెచ్చాడు. అన్‌లోడ్ తరువాత తిరిగి వెళ్తుండగా సెగిడి వీధి సమీపంలో ట్రాక్టర్ తగిలి ద్విచక్ర వాహనం పడిపోయింది. ఈ విషయమై ద్విచక్ర వాహనదారుడు కూర్మాన మణి, అతని మామయ్య సెగెళ్ల వెంకటరావుకు ట్రాక్టర్ నడుపుతున్న శ్రీను, అతని కుమారుడు గంగరాజుకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుని కొట్లాటకు దారితీసింది. ఇరువర్గాలకు గాయాలు కావడంతో రిమ్స్‌లో చికిత్స పొందారు. అవుట్‌పోస్టు పోలీసుల సమాచారం మేరకు వన్ టౌన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

టెన్యూర్ పీపీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణచంద్

గుజరాతీపేట: టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వాన కృష్ణచంద్ ఎంపికయ్యారు. గుంటూరులో ఈ నెల 12న జరిగిన ఈ ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం కృష్ణచంద్ జిల్లా ఫ్యామిలీ కోర్టు, మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన గతంలో పీపీగా, జిల్లా బార్ అసోసియేషన్ న్యూ మిలినియం అధ్యక్షుడిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల అకడమిక్ సభ్యునిగా వ్యవహరించారు. ఈయన ఎంపికపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.వాసుదేవరావు, కార్యవర్గ ప్రతినిధులు పి.రాము, జి.చంద్రమౌళి, భవానీ ప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు


కోలాటం ఆడుతున్న కళాకారులు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర క్రీడలు, టూరిజం శాఖా మంత్రి అవంతి శ్రీనివాస్, విజయనగరం జిల్లా నెలిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, సినీనటుడు, రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ హెడ్ జోగినాయుడు, ఎస్‌బీఐ డీజీఎం పంకజ్ కుమార్, రాజమండ్రి డీజీఎం ప్రమోద్ కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ వేదాశీర్వచనం చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అలరించిన కోలాటం

భోగి సందర్భంగా ఆలయ ఆవరణలో స్థానిక కాపువీధికి చెందిన సూర్యతేజ బృందంచే నిర్వహించిన కోలాటం కార్యక్రమం నిర్వహించారు. ఈ కోలాటాలు చూపరులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం ఆలయ అనివెట్టి మండపంలో చిన్నారులకు భోగిపండ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు శంకరశర్మ, సూపరింటెండెంట్ చక్రవర్తి, అర్చకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే మోదీ ధ్యేయం

జి.సిగడాం: పేదల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు, వజ్జపర్తి రఘురాం అన్నారు. ఆదివారం దవళపేట, దేవరవలస గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహించారు. సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, పొగిరి దాశరథి, ఎంఈవో అరసాడ రవి, వైద్యసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

జనరిక్ మందుల షాపు ప్రారంభం

శ్రీకాకుళం క్రైం: జిల్లా సహకార మార్కెట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అరసవల్లి మెయిన్ రోడ్డులో జనరిక్ మందుల షాపును ప్రారంభించారు. డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, కోఆర్డినేటర్ కె.దామోదరరావు, సంఘ సభ్యులు జల్లు బలరాం, దుర్గారావు, బిజినెస్ మేనేజర్ మార్పు జగ్గు నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవో ప్రతులు భోగి మంటలో వేసి

● యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సమస్యలపై ప్రశ్నించిన ఉపాధ్యాయులను అరెస్ట్ చేయడం, నిర్బంధాలకు గురిచేయడాన్ని వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసనలు తెలిపారు. ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా ఇచ్చిన జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి ప్ర భుత్వ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమాల్లో ఆ సంఘం నేతలు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


టెక్కలి: భోగి మంట వద్ద జీవో ప్రతులతో యూటీఎఫ్ ప్రతినిధుల నిరసన


నరసన్నపేటలో..


ఎల్ఎన్ పేటలో..


సోంపేటలో..

భోగి మంటలో టైట్లింగ్ యాక్ట్ జీవో కాపీలు


భోగి మంటలో జీవో కాపీలు వేస్తున్న న్యాయవాదులు

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో రద్దు చేయాలని కోరుతూ ఆదివారం ఆ జీవో కాపీ పత్రాలను భోగి మంటలో నిరసన తెలిపారు. న్యాయవాదులు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నా చట్టాన్ని రద్దు చేయకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయాలని ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజుపాత్రో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.సోమశేఖర్, ఎస్ఎన్ నారాయణ, ఎన్.రమణయ్య, గిన్ని సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అప్పటి హెచ్ఎం నీలాద్రిరావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎచ్చెర్ల: కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పటి పాఠశాల హెచ్ఎం ఎంనీలాద్రిరావు మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు పాటుపడతారని చెప్పారు. కార్యక్రమంలో ప్రస్తుత హెచ్ఎం మొదలవలస లక్ష్మణరావు, అప్పటి ఉపాధ్యాయులు మంగిపూడి శ్రీనివాసరావు, ఆర్.లలితకుమారి, రుక్మిణిదేవి, చంద్రయ్య, సన్యాసినాయుడు, సుశీల తదితరులు పాల్గొన్నారు. విద్యార్థి నాయకులు మీగ నమశ్శివాయ, షన్ముఖరావు, వరప్రసాద్, శ్రీనివాసరావు, చిరంజీవి, లక్ష్మి తదితరులు నిర్వహించారు.

వృద్ధాశ్రమానికి వితరణ

ఆమదాలవలస: పట్టణంలోని జూనియర్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు జిల్లా కేంద్రంలోని ప్రశాంతి వృద్ధ జనాశ్రమానికి వస్తు వితరణ చేశారు. 1996-98 సంవత్సరంలో ఇంటర్ చదివిన విద్యార్థులంతా కలిసి పది ఫ్యాన్లు అందించారు. అనంతరం పళ్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గొండు తవిటినాయుడు, పేడాడ రామకృష్ణ, కూన విక్రమ్, బలగ శ్రీనివాసరావు, బాలామణి, భారతి, సునీత, శివ తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి


ట్రోఫీ అందిస్తున్న కళావెంకటరావు

లావేరు: విద్యతో పాటు యువత అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు పిలుపునిచ్చారు. బుడుమూరు గ్రామ యువత ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో విజేతలకు బహుమతులు కళా వెంకటరావు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి నింపేందుకే స్నేహ పూర్వక మ్యాచ్


స్నేహపూర్వక మ్యాచ్‌కు హాజరైన మాజీ క్రికెటర్లు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాలోని పాత, కొత్త తరానికి క్రీడాస్ఫూర్తి నింపేందుకే ఏటా స్నేహపూర్వక మ్యాచ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి హసన్‌రాజా అన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న ఈ స్నేహ పూర్వక క్రికెట్ మ్యాచ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత దివంగత క్రికెటర్లు రాజారెడ్డి, మీర్ మహమ్మద్, కమలాకర్, వీఎస్ పంతులు, బత్తుల రమణ, ఇషాక్ మహ్మద్ తదితరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. స్నేహపూర్వక మ్యాచ్‌కు రిటైర్డు అయిన ఉన్నతాధికారులు, గతంలో జిల్లాలో క్రికెట్ నేర్చుకుని ఇతర రాష్ట్రాల నుంచి ఉన్న మాజీ క్రికెటర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీకు శిక్షకులు సీఐ ఇలియాస్ మహ్మద్, కిల్లి సుదర్శన్, రిటైర్డు పీడీ సీహెచ్ విజయభాస్కర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఉమామహేశ్వరరావు, వీవీఆర్ఎస్ మూర్తి, హక్, బి.మురళీధర్, వివిధ హోదాల్లో ఉన్న అధికారులు పాల్గొన్నారు.

మిత్రునికి ఆర్థికసాయం


సాయాన్ని అందిస్తున్న తోటి విద్యార్థులు

బూర్జ: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి (1998) చదివిన సూరి పుండరీకయ్య అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు ఆదివారం బూర్జలో అతడి ఇంటికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా అతడికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు.

జిల్లాస్థాయి క్విజ్‌పోటీలు

సోంపేట: మామిడిపల్లి గ్రామంలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. సుమారు 60 జట్లు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్, కొత్తపల్లి జడ్పీ హైస్కూల్, హరిపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. రెయ్యి కోదండకృష్ణ, దున్న కృష్ణారావు, పాతిన శేషగిరి తదితరులు ఉన్నారు.


కొండమీద ఉన్న సంగమేశ్వరాలయం

నేటి నుంచి సంగమయ్య జాతర

ఆమదాలవలస: గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలో ఉన్న సంగమయ్య కొండపైన సంగమేశ్వరాలయం ఉంది. కొండ దిగువన ఏటా జనవరిలో సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో భారీ ఎత్తున జాతర జరుగుతుంది. ఈ జాతరకు జిల్లా నుంచే కాకుండా విజయనగరం, విశాఖ, మన్యం, ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటారు.

మల్లికార్జున స్వామి యాత్ర..

జి.సిగడాం: మెట్టవలస ఏకశిలా పర్వతంపై వెలసిన మల్లికార్జున స్వామి యాత్ర సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించే ఈ యాత్రకు జి.సిగడాం, సంతకవిటి, పొందూరు, రాజాం తదితర మండలాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ యాత్రలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్టు ఎస్ఐ సామంతుల రామారావు తెలిపారు.

రేపటి నుంచి గెడ్డ కంచరాంలో...

గెడ్డకంచరాంలో వెలసియున్న పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ప్రారంభకానున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవగుప్తాపు సన్యాసిరావు వనంలో వెలసియున్న అమ్మవారిని దర్శించుకోనేందుకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారన్నారు. ఈ సందర్భంగా వివిధ వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాని తిరువీధి నిర్వహించనున్నట్టు తెలిపారు.

21న అంపైర్ల ఎంపికకు పరీక్ష

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాలో నిర్వహిస్తున్న పలు క్రికెట్ మ్యాచ్‌లకు అంపైర్ల పరీక్ష ఎంపికను ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాస్త్రి, ప్రధాన కార్యదర్శి హసన్‌రాజా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 21న ఆర్ట్స్ కళాశాల మైదానంలోని జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయానికి ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులకు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, 25 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులన్నారు. క్రికెట్‌పై పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం గ్రామానికి చెందిన కాళీమాత సేవా సమితి సభ్యులు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఆదివారం సీమూరు గ్రామంలో ఇటీవల ప్రోక్లెయిన్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన శివంగి దివాకర్ కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.10 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయానికి వితరణ

కంచిలి: స్థానిక కంచమ్మ అమ్మవారి ఆలయ గర్భగుడికి ద్వారం, స్టీల్ తలుపులు కంచిలి గ్రామానికి చెందిన రత్నాల బాబూరావు ఆదివారం వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ని అభినందించారు.

క్రికెట్ టోర్నీ విజేత వైఆర్‌సీసీ

ఇచ్ఛాపురం/రూరల్: మండపల్లి పంచాయతీ ఎం.తోటూరు క్రికెట్ మైదానంలో చిదంబరేశ్వర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హోరా హోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సీసీసీ జట్టుపై వైఆర్‌సీసీ జట్టు విజయం సాధించింది. గెలుపొందిన విన్నర్, రన్నర్ జట్లుకు వైద్యులు ఉలాల కోదండరామ్, జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గం ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో కాళ్ల దిలీప్, సాలిన గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతాపారాయణం

బూర్జ: అన్నంపేట గ్రామంలో ధనుర్మాసం సందర్భంగా హరేకృష్ణ హరేరామ భక్తులు ముగింపు కార్యక్రమం సందర్భంగా గీతాపారాయణం ఆదివారం నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు కె.రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రవచన కర్తలుగా కె.రామ్మోహన్‌రావు, పాలకొండ సత్యసాయి బాబా మందిరం నుంచి ఎస్‌వీ రమణ వ్యవహరించారు.